క్లుప్తంగా

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆయన మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీతో సమస్యలు



మానవపాడు: మండల కేంద్రంలో లోఓల్టేజీతో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఏఈ సుబ్బరాయుడుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఫ్యాన్లు, టీవీలు కాలిపోతున్నాయన్నారు.అదే విధంగా పర్మినెంట్ లైన్‌మెన్ ఏర్పాటు చేయాలని కోరారు.

అంత్యక్రియలు పూర్తి



అయిజ: పిడుగుపాటుకు గురై మండలంలో ముగ్గురు వ్యక్తులు బుధవారం మృతి చెందారు. గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం గురువారం భూంపురానికి చెందిన పార్వతి, సర్వేష్, పులికల్ గ్రామానికి చెందిన సౌభాగ్యకు వారి స్వగ్రామాల్లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జ్యోతి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల్లో పలు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

గద్వాల: అయిజ మండలంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అయిజ మండలం భూంపురం, పులికల్ గ్రామాలకు చెందిన సర్వేస్, పార్వతి, సౌభాగ్యలు కూలీ పనులకు వెళ్లి పిడుగుపడి మృతి చెందిన ఘటన కలచి వేసిందన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలబడి ఆర్థికంగా ఆదుకోవాలని పేర్కొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ విడుదల

మల్దకల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల ఆధ్వర్యంలో గురువారం ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను తహసీల్దార్ ఝాన్సీ రాణి ఆధ్వర్యంలో విడుదల చేశారు. హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21వ తేదీల్లో ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. మండలంలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసీల్దార్, సంఘ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కరీం, ఆర్ఐ మహేందర్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రంగన్న, హరి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి

మల్దకల్: జిల్లా కేంద్రంలో ఈ నెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హన్మంతునాయుడు సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శేఖర్‌నాయుడు, బీచుపల్లి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

కేటీదొడ్డి: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పాతపాలెంలో గురువారం రోడ్డు భద్రత, ట్రాఫిక్, సైబర్ నేరాలపై కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు గ్రామంలో అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు చేసిన ప్రోత్సాహించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



సాసనూలులో తయారైన నాణ్యత లేని ఎరువు



సాతర్లలో ఇళ్ల మధ్యన పారబోసిన చెత్త

చెత్త రీసైక్లింగ్ ఊసేది?

- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- ప్రతి జీపీలో రూ. 2.5 లక్షలతో నిర్మాణం
- నిధుల కొరత పేరుతో చెత్త సేకరణకు మంగళం

ఎర్రవల్లి: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రతి జీపీలో సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. నిరుపయోగంగా మారిన సెగ్రిగేషన్ షెడ్లతో ప్రభుత్వ లక్ష్యం, ప్రజాధనం వృథా అవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్డుల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి జీపీకి రూ. 2.5 లక్షల నిధులను కేటాయించింది. దీని ద్వారా షెడ్‌ను నిర్మించి గ్రామాల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రీయ ఎరువులను తయారు చేయాలని సూచించింది. ఇక్కడ తయారు చేసిన కంపోస్టు ఎరువును గ్రామంలోని పంటలకు ఉపయోగించేందుకు గాను రైతులకు విక్రయించాలని కార్యదర్శులను ఆదేశించింది. కానీ ప్రస్తుతం సగానికి పైగా జీపీల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వానపాములు సకాలంలో రాకపోవడంతో ఎరువు తయారీ పనులు నేటికి కూడా ప్రారంభం కాలేదు. దీంతో ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నీరుగారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



షేకుపల్లిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు

నాణ్యతలేని కంపోస్టు ఎరువు

అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్‌యార్డుల నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టారు. కానీ అందులో కంపోస్ట్ ఎరువు తయారీ పనులను సక్రమంగా చేపట్టకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. నియోజకవర్గంలోని 124 జీపీలకు గాను కేవలం 88 షెడ్లలో మాత్రమే ప్రస్తుతం వానపాములను ఉపయోగించి కంపోస్టు ఎరువును నామమాత్రంగా తయారు చేస్తున్నారు. వీటిలో తయారు చేసిన ఎరువు కూడా ఏమాత్రం నాణ్యతతో లేదని రైతులు వాపోతున్నారు. అందులో తడి, పొడి చెత్తను వేయకుండా ఎక్కువ మొత్తంలో కేవలం మట్టిని మాత్రమే వేయడం వల్ల వానపాములు చనిపోతున్నాయని తెలుపుతున్నారు.

అందుబాటులో లేని వానపాములు

మిగిలిన 36 షెడ్లలో ఇప్పటి వరకు వానపాములు అందుబాటులోకి రాలేదు. పలు జీపీల్లో నిధుల కొరత పేరుతో కనీసం జీపీ ట్రాక్టర్ల ద్వారా నిత్యం చెత్త సేకరణ కూడా సక్రమంగా చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను సేకరించడం లేదు



గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇళ్ల నుంచి చెత్తను సక్రమంగా సేకరించడం లేదు. వారంలో కేవలం ఒకటి రెండు రోజులు మాత్రమే తిరిగి అరకొరగా సేకరిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదు.

– తెలుగు వీరేష్, ఎర్రవల్లి

వంద శాతం పనులు పూర్తి



మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం పనులు వంత శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం 8 పంచాయతీల్లో వానపాముల ద్వారా తడి, పొడి చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. మిగిలిన పంచాయతీల్లో వానపాములు అందుబాటులో లేనందున ఎరువుల తయారీని చేపట్టలేదు.షెడ్లలో తయారు చేసిన కంపోస్టు ఎరువును హరితహారం చెట్లకు వినియోగిస్తున్నాం.

– మహ్మద్ అబ్దుల్ సయ్యద్‌ఖాన్, ఎంపీడీఓ ఎర్రవల్లి

ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి



ప్రయాణికులకు గొడుగు పట్టి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో వర్షం తడుస్తున్న ప్రయాణికులకు బీజేపీ నాయకులు గొడుగులు పట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. మండలంలో డిపో లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా అయిజ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్టీసీకి సంబంధించి మొత్తం 60 షాపులు ఉన్నాయని, వాటి నుంచి ప్రతి సంవత్సరం రూ. 50 లక్షల అద్దె వస్తుందన్నారు. అయిజ బస్టాండ్ నుంచి ప్రతి రోజు 150 ట్రిప్పులకు పైగా బస్సులు రాకపోకలు జరుగుతున్నాయన్నారు. భారీ ఆదాయం వస్తున్న బస్టాండ్ అభివృధికి మాత్రం నోచుకోవడం లేదన్నార. బస్టాండ్‌లో కనీస వసతులు లేక పోవడం దారుణమన్నారు. వెంటనే మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, అంజి, రాజశేఖర్, ఖుషి, రఘు, కృష్ణ, వెంకట్రాములు, వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేశారు

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నుంచి గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ మండిపడ్డారు. మండలంలో బింగుదొడ్డి గ్రామంలో వివిధ కాలనీల్లో గురువారం కురిసిన వర్షానికి మురుగు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీలు పర్యటించిన బీజేపీ నాయకులు మురుగులో నాట్లువేసి వినూత్నంగా నిరసన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అబద్ధపు హామీలతో గద్దెనెక్కారని ఆరోపించారు. తక్షణమే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, నాగన్న, హనుమంతు, వీరన్న, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



మురుగులో నాట్లు వేస్తున్న బీజేపీ నాయకులు, ప్రజలు

వీఆర్ఏల వారసులను నియమించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏ జేఏసీ నాయకులు

అలంపూర్: వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వీఆర్ఏల జేఏసీ నాయకులు కోరారు. కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో అలంపూర్ నియోజకవర్గంలోని వీఆర్ఏలు ఎమ్మెల్యే విజయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం 2020లో అసెంబ్లీలో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించినట్లు గుర్తు చేశారు. దీర్ఘకాలిక సమ్మెల అనంతరం జీఓ నంబర్ 81, 85 విడదల చేసినట్లు తెలిపారు. కానీ ఇప్పటికీ ఆ హామీ అమలు కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20,555 మందిలో 16,758 మందిని మాత్రమే సర్దుబాటు చేసినట్లు తెలిపారు. మిగిలిన 3,797 మంది వారసులు గత రెండేళ్లుగా నిరీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. వారసుల నియమకాల్లో జాప్యం జరుగుతుండటంతో వీఆర్ఏల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మె ల్యే వీఆర్ఏల సమస్యల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వీఆర్ఏ జేఏసీ నాయకులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఎర్రవల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ రవినాయక్ తెలిపారు. కర్నూలు సమీపంలోని తుంగభద్ర నది నుంచి లారీలో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తుండగా హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గురువారం తెల్లవారు జామున జింకలపల్లి స్టేజీ వద్ద లారీని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నేరం

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం గ్రామంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలను పనికి పంపించడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాహుల్, కేశవులు, భూపతి, హజరత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంట నాశనం చేసిన అన్నపై తమ్ముడి ఫిర్యాదు

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం గ్రామంలో కంది పంట నాశనం చేసిన అన్నపై తమ్ముడి ఫిర్యా దు చేసిన ఘటన గురువారం జరిగింది. గ్రామానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు సాగు చేసిన 2 ఎకరాల 27 కుంటలోని కంది పంట ఎండిపోయేందు కు తన అన్న కురువ రాముడు మందును పిచికారీ చేసినట్లు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పంట ఎండిపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కురువ రాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

కేంద్ర పథకాలు అందరికీ అందాలి



మల్దకల్: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని, పథకాల అమలుపై ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బల్గెర నల్లారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని దామనాగరాజు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యకర్తల సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 17న రక్తదాన శిబిరాలు, 18న మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆత్మనిర్భర భారత్, వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖనం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ దామనాగరాజు, తిమ్మన్న, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్ అంతా రోబోటిక్స్‌దే'

ధరూరు: రానున్న రోజుల్లో రోబోటిక్స్ రంగం దూసుకెళ్తుందని హైదరాబాద్‌కు చెందిన సోహం అకాడమీ ప్రతినిధి అరవింద్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. టెక్నాలజీ పరంగా ఏటేటా ముందుకు సాగుతున్న తరుణంలో రానున్న రోజుల్లో టెక్నికల్ రంగమే ముందంజలో ఉంటుందన్నారు. టెక్నాలజీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్, రాధారాణి, లక్ష్మీకాంతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. పొంగిన వాగులు



చెన్నిపాడు- మానవపాడు కల్వర్టు వద్ద కోతకు గురైన రోడ్డు

గట్టు/అయిజ/కేటీదొడ్డి/ మానవపాడు: గట్టు మండలంలో గురువారం 88.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. భారీ వర్షానికి గట్టు చెరువు కాల్వ నిండుగా ప్రవహిస్తోంది.

- అయిజ పట్టణంలోని మడ్డి గుంతకాలనీ మోకాటి లోతుగా నీటిలో మునిగింది. గాజులపేట కాలనీ చెరువును తలపించింది. చిన్న తాండ్రపాడులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాలు వర్షం నీటిలో మునిగాయి.
- కేటీదొడ్డి మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు, చెరువులకు వరద భారీగా చేరింది. అక్కడక్కడ పత్తి పంటలోకి వరద చేరడంతో రైతులు ఇబ్బందులు గురయ్యారు.
- మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో జోరువాన కురిసింది. కల్వర్టుల వద్ద రహదారులకు కోతకు గురయ్యాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న గట్టు చెరువు కాల్వ



కేటీదొడ్డిలో భారీ వర్షానికి పారుతున్న వాగు

ఆంగ్లంపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగించాలి

గట్టు: విద్యార్థుల్లో ఆసక్తిని కల్గించే విధంగా ఆంగ్లం సబ్జెక్టును బోధించాలని కాంప్లెక్స్ హెచ్ఎం నల్లారెడ్డి కోరారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో గట్టు, ధరూరు, కేటీదొడ్డి మండలాల ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లారెడ్డి మాట్లాడుతూ.. ఆంగ్లాన్ని సులభతరంగా బోధించాలన్నారు. అదే విధంగా పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన ముగ్గురు ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న మల్లప్ప, హేమచంద్రుడుని సన్మానించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ టెక్నాలజీపై అవగాహన



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం నల్లారెడ్డి

ఎక్స్‌పీరియన్స్ ఆన్ హ్యాండ్స్ ప్రోగ్రాంలో భాగంగా సోహం రోబోటిక్స్ సంస్థకు చెందిన రిసోర్స్ పర్సన్ 8వ తరగతి విద్యార్థులకు లెర్నింగ్ బై డూయింగ్ మెథడ్‌లో రోబోటిక్ టెక్నాలజీపై గురించి తెలియజేశారు. 15 మంది విద్యార్థులకు సోహం రోబోటిక్స్ ప్రయోగాలకు ఎంపిక చేసినట్లు హెచ్ఎం నల్లారెడ్డి తెలిపారు.

కార్మిక చట్టాల అమలులో విఫలం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నరసింహ

అలంపూర్: కార్మిక చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. పట్టణంలో సీఐటీయూ మండల మూడో మహాసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కార్మిక వర్గానికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, ఉద్యోగ భద్రత పెన్షన్ అందజేయాలన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు తక్షణమే చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్మికులను కేటగిరీ వారీగా జీతాలు చెల్లించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం సక్రమంగా అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఏమేలమ్మ, నాగేశ్వరమ్మ, శారద, రాధా, లక్ష్మీనారయణ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

ధరూరు: ఒక బస్తా యూరియా కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, ఏం చేయాలో తోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటకు మందులు వేసే సమయం దాటి పోతుండడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్నామని వాపోతున్నారు. మండల కేంద్రంలోని మన గ్రోమోర్, సహకార కార్యాలయాలకు రైతన్నలు క్యూ కడుతున్నారు. సింగిల్ విండో కార్యాలయానికి యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు వారం రోజులుగా తిరుగుతున్నా యూరియా ఇవ్వడం లేదని వాపోతున్నారు. బడా రైతులకు, పైరవీకారులకు, గట్టిగా అరిచే వారికే ఇక్కడ స్థానం ఉందని, వారికే ముందుగా ఎరువులు అందిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున 4.30 గంటలకే సహకార కార్యాలయం వద్దకు చేరుకొని తమ పాసు పుస్తకాలను క్యూలైన్‌లో ఉంచారు. అయినా యూరియా అందుతుందన్న భరోసా లేదని వారు వాపోతున్నారు.



ధరూరు సహకార కార్యాలయం వద్ద ఉదయం 6 గంటలకే పడిగాపులు కాస్తున్న రైతులు

నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం

గట్టు: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను రాష్ట్రంలో విడుదల చేసినట్లు టెక్నికల్ అధికారి నితిన్ అన్నారు. గురువారం తుమ్మలచెరువు గ్రామంలో సబ్ డీలర్ ఈశ్వరామ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నితిన్ మాట్లాడుతూ.. సిమెంట్ వ్యాపార రంగంలో తిరుగులేని సంస్థగా వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. భారతి సిమెంట్ మార్కెట్ లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. సిమెంట్ వినియోగ దారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీలర్ నరేంద్రచారి, మేస్త్రీలు పాల్గొన్నారు.



సమావేశంలో టెక్నికల్ అధికారి నితిన్, మేస్త్రీలు

బ్యాంకు సేవలను ఉపయోగించుకోవాలి

గట్టు: బ్యాంకుల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ కోరారు. గురువారం ముచ్చోనిపల్లె గ్రామంలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాలను తెరవాలని కోరారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన యోజన, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ కౌన్సిలర్లు అనూష, ప్రతాప్‌గౌడ్, ప్రకాష్, వీరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు తప్పిన ప్రమాదం

కేటీదొడ్డి: మండలంలోని పూజారితండా చెరువు కట్ట మీదుగా అంబులెన్స్ వెళ్తున్న క్రమంలో ఉన్న మట్టిరోడ్డులో ఇరుక్కుపోయిన ఘటన గురువారం జరిగింది. జేసీబీ సాయంతో అంబులెన్స్‌ను స్థానికులు బయటకు తీశారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

గద్వాల: జిల్లా కేంద్రంలోని గంజిపేటలో ప్రజలు నిరంతరం విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నార ని అధికారులు స్పందించి వెంటనే పరిష్కరించాల ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ కోరారు. గురువారం కాలనీ వాసులతో ఆయన మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తానని పేర్కొన్నారు.